

జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 347 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 18, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

ఆదర్శవంతమైన పోలీస్ శాఖ ఏర్పాటుకు తీవ్రమైన కృషి

పెండింగ్లో ఉన్న పదోన్నతులను

సరిచేసిన మొనగాడు రాష్ట్ర డిజిపి

నవీనమైన మార్పులతో దూసుకుపోతున్న

తెలంగాణ పోలీస్ శాఖ

రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్ ఐపీఎస్

ఆధ్వర్యంలో అన్ని ప్రత్యేకతలు

రాష్ట్ర పోలీస్ శాఖలో ప్రత్యేకతకు మారు

పేరు సివి ఆనంద్ ఐపిఎస్

పేరుకుపోయిన పదోన్నతులను శాంతియుతమైన

మార్గంలో న్యాయంచేశారు

దేశం మొత్తం తెలంగాణ పోలీస్ శాఖ వైపు చూస్తుంది

పోలీస్ ఉన్నత అధికారుల అవినీతిని సైతం

వదలని రాష్ట్ర డిజిపి

పోలీస్ శాఖను గర్వంగా తలెత్తుకొని

తిరగ్గలిగే స్థానానికి చేరుస్తున్నారు

నూతన పదోన్నతులతో ఉత్సాహంలో

పోలీస్ అధికారులు

జటిలమైన సమస్యలను అలవోకగా అధిగమించారు

ఎంచుకున్న మార్గం గొప్పదైతే ఎంతటి సమస్య ఐనా

సునాయాసంగా తీర్చుకోగలం



రాష్ట్ర పోలీసు శాఖలో.. సామాజిక న్యాయం !

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

రాష్ట్ర పోలీస్ శాఖలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్ సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పోలీసు అధికారుల పదోన్నతుల సమస్యకు రాజీమార్గంలో పరిష్కారం చూపి తన ప్రత్యేకతను చాటుకున్నారు. సీనియారిటీ, రిజర్వేషన్ రోస్టర్, ఖాళీలపై నెలకొన్న వివాదాలను అధికారుల మధ్య ఏకాభిప్రాయంతో పరిష్కరించే దిశగా కీలక అడుగు వేశారు. తొలివిడతలో 54 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు మార్గం సుగమం చేశారు. మరోవైపు 12 మంది అదనపు ఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారుల చిరకాల నిరీక్షణకు తెరదించేలా పదోన్నతి ప్యానళ్లను సిద్ధం చేశారు. కోర్టు వివాదాలకు తావులేకుండా, ఎవరికీ అన్యాయం జరగకుండా నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపారు. డీజీపీ సీవీ ఆనంద్ నాయకత్వంలో తెలంగాణ పోలీస్ శాఖలో చోటుచేసుకుంటున్న ఈ మార్పులు సామాజిక న్యాయానికి, పరిపాలనా దక్షతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

బల్దియాలో జీతాలకు ‘జీవో’ కత్తెర !

1181 జీవోతో బల్దియా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు భారీ కోత!

ఒకే విధులు.. ఒకే బాధ్యతలు.. అయినా జీతాల్లో వ్యత్యాసాలెందుకు?

రూ.22,750 నుంచి రూ.16,600కు వేతనం తగ్గింపు..

నెలకు రూ.6,150 కోత !

మరికొందరికి రూ.3,250 కోత..

ఏళ్ల తరబడి చేసిన సేవలకు గుర్తింపు లేదా?

సీనియార్టీ పెరుగుతే జీతాలు పెరుగుతాయి కానీ ఇక్కడ జీతాలు తగ్గుతాయి

పాత వేతనాలైనా కొనసాగించాలని ఉద్యోగుల వేడుకోలు..

కూలి పనులకు వెళ్తున్న కార్మికులు!



4

టాటా గ్రూప్‌లో విభేదాలు

నోయెల్ టాటాపై జిమ్మీ టాటా తీవ్ర ఆరోపణలు

టాటా సన్స్‌ను కుటుంబ నియంత్రణలోకి తెచ్చే యత్నమని విమర్శ

ట్రస్టుల్లో కుటుంబ సభ్యుల నియామకాలపై అభ్యంతరం

చంద్రశేఖరన్ పదవీకాల పొడిగింపుపైనా భిన్నాభిప్రాయాలు

ఐపీవో వివాదంలో జోక్యం చేసుకోవాలని ఆర్బీఐకి విజ్ఞప్తి

2

హైదరాబాద్‌లో భూముల మెగా వేలం

ఈ నెల 25, 27 తేదీల్లో హెచ్ఎండీఏ ఈ-వేలం

హుడా హైట్స్‌లో 8 ప్లాట్ల విక్రయం

నియోపాలిస్‌లో 4.59 ఎకరాల స్థలం వేలం

మూసాపేట్‌లో 3.15 ఎకరాల భూమికి బిడ్డింగ్

ప్రీ-బిడ్ సమావేశంలో నిబంధనలపై అధికారుల వివరణ

7

పోరంబోకోనికి పత్తనం

ఆడోళ్ళను వేధించినోనికి నిరంతర రాజ మర్యాదలు

- హాస్టల్స్ లో సీసీ కెమెరాలు అడ్డం పెట్టుకొని అమ్మాయిలను విచిత్రంగా చూసిన వెధవ
- సీసీ కెమెరాలు పెట్టమని తెగ దౌర్జన్యం చేస్తున్నాడు
- అసలు కైతే సీసీ కెమెరాలు పెట్టాల్సిందే అధికారుల డార్మ్ రూములలో
- కమిటీలో బ్రోకర్ గాని పేరు పెట్టింది కంట్రోలరేనా..
- వీసీకి కనీసం పట్టింపు లేకపోతే ఎలా...
- అవినీతి అక్రమార్కులంతా కలిసి కేయుతో ఆటలాడుతున్నారు
- కేయూ అధికారులు ఇంతగా బరితెగిస్తే ఎలా..
- కీచకుడు జీవితమంతా మహిళలను వేధించడానికి సరిపోతుంది



3

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

రాష్ట్ర పోలీస్ శాఖలో సామాజిక న్యాయం

ఆదర్శవంతమైన పోలీస్ శాఖ
ఏర్పాటుకు తీవ్రమైన కృషి
పెండింగ్లో ఉన్న పదోన్నతులను
సరిచేసిన మొనగాడు రాష్ట్ర డిజిపి
నవీనమైన మార్పులతో దూసుకుపోతున్న
తెలంగాణ పోలీస్ శాఖ
రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్ ఐపీఎస్
ఆధ్వర్యంలో అన్ని ప్రత్యేకతలు
రాష్ట్ర పోలీస్ శాఖలో ప్రత్యేకతకు
మారు పేరు సివి ఆనంద్ ఐపిఎస్
పేరుకుపోయిన పదోన్నతులను శాంతియుతమైన
మార్గంలో న్యాయంచేశారు
దేశం మొత్తం తెలంగాణ పోలీస్ శాఖ వైపు
చూస్తుంది
పోలీస్ ఉన్నత అధికారుల అవినీతిని సైతం వదలని
రాష్ట్ర డిజిపి
పోలీస్ శాఖను గర్వంగా తలెత్తుకొని తిరగ్గలిగే
స్థానానికి చేరుస్తున్నారు
నూతన పదోన్నతులతో ఉత్సాహంలో పోలీస్
అధికారులు
జటిలమైన సమస్యలను అలవోకగా అధిగమించారు
ఎంచుకున్న మార్గం గొప్పదైతే ఎంతటి సమస్య ఐనా
సునాయాసంగా తీర్చుకోగలం
డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)



దేశంలోనే కొత్త రకమైన పోలీస్ విధానాన్ని అవలంబిస్తూ అమలుపరుస్తున్న రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్ ఐపీఎస్ దేశవ్యాప్తంగా తన వృత్తిపరమైన ప్రతిభను, ప్రావిణ్యతను చాటుకుంటున్నారని డాక్టర్ బరిగెల శివ గర్వంగా చెప్పారు.దశంలో అన్ని రాష్ట్రాల పోలీస్ శాఖలకు తెలంగాణ పోలీస్ శాఖకు విభిన్నమైన వ్యత్యాసాలు కనిపిస్తున్నాయన్నారు. పోలీస్ పరంగానే కాకుండా సామాజిక సేవలో పోలీసు శాఖను పాలి భాగస్తులను చేయడం రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపీఎస్ వాళ్ల మాత్రమే సాధ్యం కాగలుగుతుందని ప్రత్యేకించి తెలిపారు. ఎన్నో సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో పేరుకుపోయిన జటిలమైన పదోన్నతుల సమస్యలను సునాయాసం మన మార్గంలో రాజీ కుదిర్చి పదోన్నతులు కల్పించడంలో పూర్తిస్థాయిలో సఫలీకృతులైనరని అభినందనలు తెలియజేశారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా పోలీస్ అధికారుల మధ్య న్యాయపరంగా సయోధ్య ఏర్పరిచి పెండింగ్ పదోన్నతులను సరిచేయడం వల్ల 1995 మొదలుకొని నేటి వరకు ఉన్నత స్థాయిలో పదోన్నతులు పొందుకోవాల్సిన అధికారులు రాష్ట్ర డిజిపి నిర్ణయంతో,రాష్ట్ర డిజిపి చోరవతో వాళ్లకు న్యాయం జరిగినందున సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గత ఆరు నెలలుగా తెలంగాణ పోలీస్ శాఖలో దేశంలో ఎక్కడ లేని నవీనమైన మార్పులు సంతరించుకుంటున్నాయని ప్రజల బాగోగులను శాంతిభద్రతల రక్షణను కాపాడడంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారని అభినందించారు ఏ రాష్ట్రంలోనైనా పోలీస్ శాఖపై ప్రతిపక్షాలు కాస్తంత వ్యతిరేకతను ప్రదర్శిస్తాయన్నమాట వాస్తవమైనప్పటికీ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపీఎస్ విషయంలో తెలంగాణ రాష్ట్ర రాజకీయ పార్టీలే కాకుండా ఇతర రాష్ట్ర రాజకీయ పార్టీలు డిజిపి ప్రత్యేకతకు అభినందనలు తెలియజేస్తున్నాయన్నారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుండి పోలీస్ శాఖలు ఏ విధమైనటువంటి మార్పులు తీగలమో వాటన్నింటినీ ముందస్తుగానే అంచనాలు వేసుకొని రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న రాష్ట్ర డిజిపి సీవి ఆనంద్ ఐపీఎస్ మరెన్నో అద్భుతాలు సృష్టించగలరని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. మంగళవారం బిజెపి కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాష్ట్రస్థాయి పోలీస్ శాఖ సమీక్షలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ వాళ్లకు న్యాయం చేశారు. అట్టి వివరాలను పరిశీలించాల్సి ఉండగా....

రాజీమార్గమే రాజమార్గం..

అడిషనల్ ఎస్పీ,నాన్ క్యాడర్ ఎస్పీలుగా ప్రమోషన్లకు మార్గం సుగమం!

పెండింగ్ ప్రమోషన్లపై డిజిపి సీవి. ఆనంద్ ప్రత్యేక చొరవ

కోర్టు వివాదాలకు స్వస్తి.

అధికారుల మధ్య ఏకాభిప్రాయం

తొలి విడతలో 54 డీఎస్పీలకు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి,

2027 ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు.

12 మంది అడిషనల్ ఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి,

ప్యానల్ ఇయర్లో మరో 10 నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి

1991, 1995, 1996 బ్యాచ్లకు ప్రమోషన్ ప్యానళ్లు సిద్ధం

అధికారుల ఏకాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్న డిజిపి సీవి. ఆనంద్

ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న పోలీసు అధికారుల పదోన్నతుల సమస్యకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. సీనియారిటీ వివాదాలు, రిజర్వేషన్ ఆఫ్ రోస్టర్ (ఆర్ఓఆర్), ఖాళీలు, అర్హతలపై నెలకొన్న విభేదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు డిజిపి సి. వి. ఆనంద్ చొరవ తీసుకున్నారు. న్యాయస్థానాల్లో కేసులు, వివాదాల కారణంగా అర్హులైన అధికారులు పదోన్నతులు కోల్పోకూడదనే ఉద్దేశంతో ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నించారు. ఈ మేరకు మంగళవారం డిజిపి కార్యాలయంలో 1991, 1995, 1996 బ్యాచ్లకు చెందిన సివిల్ ఎస్పైలతో ఆయన సమావేశమయ్యారు. వరంగల్, హైదరాబాద్ రేంజ్లతో పాటు హైదరాబాద్ నగరానికి చెందిన అధికారులు ఇందులో పాల్గొన్నారు. పదోన్నతుల ప్రక్రియలో ఎదురవుతున్న అభ్యంతరాలు, సీనియారిటీ, రోస్టర్ పాయింట్లు, ఖాళీలు, అర్హతలపై చర్చించారు.

తొలిదశలో 54 అదనపు ఎస్పీ పోస్టులు..

డీఎస్పీ స్థాయి అధికారులకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు మొత్తం 54 పోస్టులు తొలిదశలో అందుబాటులో ఉన్నట్లు అధికారులు వివరించారు. రెండో దశలో 2027 ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు 1991, 1995, 1996 బ్యాచ్లకు సంబంధించి పదోన్నతి ప్యానళ్లను సిద్ధం చేశారు. గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 74 ప్రకారం పదోన్నతుల ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, సీనియారిటీపై కొందరు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వివాదాలు తలెత్తాయి. కమిటీ నివేదిక, ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలను ప్రస్తుత సమావేశంలో సమీక్షించారు.

12 ఎస్పీ (నాన్ క్యాడర్) పోస్టుల పదోన్నతులకి చర్యలు..

ప్రస్తుతం 12 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టుల విషయంలో ఎలాంటి న్యాయపరమైన వివాదాలు, కోర్టు కేసులు లేనందున వాటిని తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. వీటితోపాటు ప్యానల్ ఇయర్లో మరో 10 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులు కేటాయించనున్నట్లు వివరించారు.

ఏకాభిప్రాయానికి అధికారుల సమ్మతి..

అందుబాటులో ఉన్న ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, అర్హులైన అధికారుల వివరాలను డిజిపి కార్యాలయ అధికారులు సమావేశంలో పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సర్వీసు కాలం, సీనియారిటీ, రోస్టర్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తొలిదశ, రెండో దశ పదోన్నతి జాబితాలను రూపొందించారు. తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు అధికారులకు అవకాశం కల్పించారు. ప్రతిపాదిత జాబితాల ప్రకారం ముందుకు వెళ్లేందుకు అధికారులు అంగీకారం తెలిపారు.

ముఖ్యమంత్రి దృష్టికి ఏకాభిప్రాయం..

సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తానని డిజిపి సివి. ఆనంద్ తెలిపారు. సీనియారిటీ వివాదాలు, కోర్టు కేసులు దీర్ఘకాలం కొనసాగితే చివరకు అందరికీ నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పదవీ విరమణకు చేరువలో ఉన్న అధికారులు పదోన్నతి అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అర్హులైన ప్రతి అధికారికి న్యాయం జరగాలన్నదే పోలీసు శాఖ ఉద్దేశమని, అదే సమయంలో ఎవరికీ అన్యాయం జరగకుండా నిబంధనల ప్రకారమే పదోన్నతులు కల్పిస్తామని డిజిపి స్పష్టం చేశారు. సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించిన అధికారులు పదవీ విరమణకు ముందే పదోన్నతి పొందితే వారికి తగిన గుర్తింపు, సంతృప్తి లభిస్తుందని అభిప్రాయపడ్డారు. డిజిపి చొరవతో అధికారుల మధ్య ఏకాభిప్రాయం కుదరడం, వివాదాల పరిష్కారానికి మార్గం సుగమం కావడంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతుల ప్రక్రియ త్వరలోనే కొలిక్కి వస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ సమావేశంలో డిజిపి సివి ఆనంద్, మహిళా భద్రతా విభాగం డిజి సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ ఎం. భగవత్, అదనపు డిజిలు (శాంతిభద్రతలు) ఆకున్ సబర్వాల్, (ఇంటెలిజెన్స్) విజయ్కుమార్, ఐజీలు షానవాజ్ ఖాసీం (పర్సనల్, మల్టీజోన్-2), కార్తికేయ (మల్టీజోన్-1), జాయింట్ డైరెక్టర్ రోడ్డు సేఫ్టీ జోయల్ డేవిస్,జాయింట్ పోలీస్ కమిషనర్ చందనా దీప్తి, డీఐజీ నారాయణ నాయక్, ఎల్ ఎస్ చౌహాన్ తో పాటు పలువురు సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మామునూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి - పోలీస్ సిబ్బందికి సీపీ సూచనలు



వరంగల్, నవంబర్ 17(జై భీమ్ క్రైమ్ న్యూస్)

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ మంగళవారం మామునూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యమైన దర్యాప్తుతో కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు. అలాగే డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతూ డ్రగ్స్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖ తరఫున నిరంతరం కృషి చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, పర్వతగిరి సీఐ ఆర్. సంతోష్ కుమార్, మామునూరు ఇన్స్పెక్టర్ ఈ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





వంగర, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరిట హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె పీవీ విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రంలోని ఫోటో గ్యాలరీ, మ్యూజియం, కాన్ఫరెన్స్ హాల్, ఆర్ట్ గ్యాలరీతో పాటు ప్రాంగణంలో నాటిన మొక్కలు, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా కొనసాగుతున్న పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పీవీ విజ్ఞాన కేంద్రంలో అభివృద్ధి పనులు దాదాపుగా పూర్తయ్యాయని, ఆర్ట్ గ్యాలరీకి సంబంధించిన పనులు మాత్రమే కొనసాగుతున్నాయని తెలిపారు. ఆర్ట్ గ్యాలరీ పనులను ఆర్కిటెక్ట్ పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ఆర్ట్ గ్యాలరీలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటు, సీసీ కెమెరాల అమరిక, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి వచ్చే నెలలో పీవీ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సృజన, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈఈ భీమ్ రావు, తహసీల్దార్ రాజేష్, డీఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టాటా గ్రూప్‌లో విభేదాలు

నోయెల్ టాటాపై జిమ్మీ టాటా తీవ్ర ఆరోపణలు
టాటా సన్స్‌ను కుటుంబ నియంత్రణలోకి తెచ్చే యత్నమని విమర్శ
ట్రస్టుల్లో కుటుంబ సభ్యుల నియామకాలపై అభ్యంతరం
చంద్రశేఖరన్ పదవీకాల పొడిగింపుపైనా భిన్నాభిప్రాయాలు
ఐపీవో వివాదంలో జోక్యం చేసుకోవాలని ఆర్బీఐకి విజ్ఞప్తి

ముంబై, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్) :

దేశీయ దిగ్గజ వ్యాపార సంస్థ టాటా గ్రూప్‌లో నాయకత్వ విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. దివంగత రతన్ టాటా సోదరుడు, సర్ రతన్ టాటా ట్రస్ట్ శాశ్వత ట్రస్టీ జిమ్మీ టాటా తన సవతి సోదరుడు, టాటా ట్రస్ట్స్ అధిపతి నోయెల్ టాటాపై తీవ్ర ఆరోపణలు చేశారు. టాటా సన్స్‌ను కుటుంబ నియంత్రణలోకి తీసుకురావడానికి నోయెల్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టాటా ట్రస్టులకు టాటా సన్స్‌లో సుమారు 66 శాతం వాటా ఉండగా, నోయెల్ తన ముగ్గురు పిల్లలు లియా, మాయ, నెవిల్‌లను ట్రస్టుల పరిధిలోని కీలక విభాగాల్లోకి తీసుకురావడాన్ని జిమ్మీ తప్పుబట్టారు. ధార్మిక ట్రస్టులు ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటయ్యాయని, కుటుంబ పెత్తనం కోసం కాదని పేర్కొన్నారు. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌కు మూడోసారి పదవీకాలం పొడిగించడాన్ని నోయెల్ వ్యతిరేకించడంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 2026లో జరిగిన బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్ కొనసాగింపునకు 4-1 మెజారిటీతో ఆమోదం లభించినప్పటికీ, నిబంధనల ఉల్లంఘన జరిగిందని నోయెల్ వాదిస్తున్నారు. మరోవైపు టాటా సన్స్‌ను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని జిమ్మీ కోరుతుండగా, స్వల్పకాలిక లాభాల ఒత్తిడితో సంస్థ సేవా దృక్పథం దెబ్బతింటుందని నోయెల్ వర్గం అభిప్రాయపడుతోంది. ఈ వివాదంలో ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం, మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ జోక్యం చేసుకోవాలని జిమ్మీ విజ్ఞప్తి చేశారు. అయితే జిమ్మీ ఆరోపణలను నోయెల్ వర్గం తోసిపుచ్చింది. ప్రస్తుతం ట్రస్టీల మధ్య విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో నవంబర్ 20 నాటికి జరగనున్న కీలక బోర్డు సమావేశంపై ఆసక్తి నెలకొంది.

విమర్శలకు రాహుల్ గాంధీ కౌంటర్

రాజీవ్, సోనియాల అనుబంధంపై వ్యాఖ్యలతో చర్చ
తల్లిదండ్రుల ప్రేమానురాగాలను గుర్తుచేసుకున్న రాహుల్
సోషల్ మీడియాలో విమర్శలపై ఎక్స్ వేదికగా స్పందన
శివపార్వతుల ఆలయ శిల్పం ఫొటోతో సందేశం
విద్వేషం నుంచి బయటపడి ప్రేమను పంచుకోవాలని పిలుపు

న్యూఢిల్లీ, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్) :

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల మధ్య ఉన్న ప్రేమానుబంధంపై తాను చేసిన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సోనియా గాంధీ రచించిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, తన చిన్నతనంలో తల్లిదండ్రుల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. భోజనం చేసే సమయంలో తండ్రి రాజీవ్ గాంధీ ఒడిలో తల్లి సోనియా గాంధీ కూర్చునేవారని వెల్లడించారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విమర్శలు, చర్చలు మొదలవడంతో మంగళవారం ఎక్స్‌లో శివపార్వతులు నందిపై ఆసీనులైనట్లు ఉన్న పురాతన ఆలయ శిల్పం ఫొటోను పంచుకున్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో భయం, కోపం, విద్వేషం పేరుకుపోయాయని, అవి ప్రేమను అనుభవించకుండా, వ్యక్తపరచకుండా అడ్డుకుంటున్నాయని పేర్కొన్నారు. ఒక నిజమైన హిందువుగా వారిని ఆ భావాల నుంచి విముక్తి చేసి, జీవితంలోని ప్రేమానుబంధాల సౌందర్యాన్ని ఆస్వాదించేలా చేయడం తన బాధ్యతని వ్యాఖ్యానించారు. తన సందేశానికి 'సత్యం శివం సుందరం' అనే పదాలను జోడించారు.

పోరంబోకోనికి పెత్తనం

ఆడోళ్ళను వేధించినోనికి నిరంతర రాజ మర్యాదలు

హాస్టల్స్ లో సీసీ కెమెరాలు అడ్డం పెట్టుకొని అమ్మాయిలను విచిత్రంగా చూసిన వెధవ

సీసీ కెమెరాలు పెట్టమని తెగ దౌర్జన్యం చేస్తున్నాడు

అసలు కైతే సీసీ కెమెరాలు పెట్టాల్సిందే అధికారుల డార్క్ రూములలో

కమిటీలో బ్రోకర్ గాని పేరు పెట్టింది కంట్రోలరేనా..

వీసీకి కనీసం పట్టింపు లేకపోతే ఎలా...

అవినీతి అక్రమార్కులంతా కలిసి కేయుతో ఆటలాడుతున్నారు

కేయూ అధికారులు ఇంతగా బరితెగిస్తే ఎలా..

కీచకుడు జీవితమంతా మహిళలను వేధించడానికి సరిపోతుంది

కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్ :

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఒక పోరంబోకు వెధవ మహిళలను వేధిస్తూ అధికారులను భయపెట్టిస్తూ దొంగ నెంబర్లతో అడ్డగోలు పేపర్ రాతలను పోస్ట్ చేస్తూ లేడీస్ హాస్టల్ డైరెక్టర్ పై మానసికంగా దాడులు చేయిస్తూ కేయూలో విపరీతమైన గొడవలు పెట్టిస్తూ అవినీతికి ఆది పురుషుడిగా అక్రమాలకు మూలపురుషులుగా గంజాయి డ్రగ్స్ మాఫియాలకు సన్నిహితుడుగా మెలుగుతూ విశ్వవిద్యాలయాన్ని ఎన్ని విధాలుగా నాశనం కావాలని కోరుకుంటున్నాడో అన్ని విధాలుగా నాశనం చేసేటోడిని కేయూ అధికారులు ఎప్పటికప్పుడు వెనకేసుకొస్తూ వాడి ఆగడాలను వాడి అరాచకాలను వాడి మహిళా వేధింపులను వాడి కథలను వాడడి అవినీతిని వాడి అక్రమాలను వాడి క్రిమినల్ కేసులను వాడు దొడ్డిదారి ఉద్యోగ జీవితాన్ని కాపాడుతూ కేయూలో అన్ని వర్గాలపై వాడిని ఉసిగొలుపుతూ అధికారులు అధికార పదవులను కాపాడుకుంటున్నారని విశ్వవిద్యాలయంలోని అన్ని వర్గాలు మండిపడుతున్నాయి. బ్రోకరిజానికి మారుపేరు కలిగిన కీచకుడు ఒకడు ఏకంగా విలేకరి అవతారం ఎత్తి ఉద్యోగి అని చెప్పుకుంటూ లక్షల రూపాయల జీతం తీసుకుంటూ మహిళలను అసాంఘిక శక్తులుగా చిత్రీకరిస్తూ వాట్సాప్ గ్రూపులలో మెసేజ్లు పోస్ట్ చేస్తూ కేయూ రెండు గేట్ల మధ్యలో తెగ విధ్వంసాన్ని సృష్టిస్తున్నాడు. మొన్నటి వరకు హాస్టల్స్ లో ఉన్న సీసీ కెమెరాను తన మొబైల్ ఫోన్కు యాక్సిస్ పెట్టుకొని అమ్మాయిలను విచిత్రంగా చూస్తూ ఆనందపడిన దుర్మార్గుడు వాటిని పసిగట్టిన కేయూ అధికారులు కేవలం రెండు హాస్టల్స్ సీసీ కెమెరాలు ఇట్టి బ్రోకర్ గాడి క్రబంధహస్తాల్లో ఉన్నాయని తెలుసుకొని వాటిని తక్షణమే తొలగించినందున 100 సార్లు రాద్ధాంతం చేస్తూ సీసీ కెమెరాలు పెట్టించండి అంటూ విపరీతమైన దాడులు చేయిస్తున్నాడు. ప్రభుత్వం వీడి పై చర్యలు తీసుకోమని చెప్పిన



వీసీకి చలనం లేదు రిజిస్ట్రార్కు కదలిక లేదు పైగా పాలకమండలి సభ్యులు వాడికి జోరుగా సపోర్ట్ చేస్తారు.వాడికి దగ్గరుండి పదోన్నతి కల్పిస్తారు మరోవైపు కంట్రోలర్ "కట్ల" వాడి ఆగడాలని మెచ్చుకొని కాన్వకేషన్ కమిటీలో ఏకంగా జర్నలిస్టుల మీద పెత్తనం చేయమని ఉసిగొల్పే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు ఇదేమని ప్రశ్నిస్తే మీ దిక్కున కాడ చెప్పుకోండి మా ఇష్టమొచ్చింది మేం చేసుకుంటాం యూనివర్సిటీ నాశనం చేయడమే మా లక్ష్యం అనే విధంగా కాన్వకేషన్ కమిటీ ఆర్డర్ను ఏకంగా రిజిస్టర్ తో సంతకం చేయించి చలామణి చేయిస్తుండడం కేయూ అధికారుల మొద్దుబారినతనం ఎంత దౌర్జన్యాన్ని ప్రదర్శిస్తుందో మేధావులు గమనించాల్సి ఉంది. ఏ ప్రభుత్వ శాఖలోనైనా తప్పులకు పాల్పడుతున్న వ్యక్తులను కఠినంగా శిక్షిస్తూ చర్యలు తీసుకునే చట్టాలు ఉంటున్న నేటి దినాల్లో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఒకే ఒక కీచక బ్రోకర్ గాడు ఎన్ని విధాల కేయూ లోని విభాగాలపై విరుచుకుపడుతూ దుర్మార్గంగా నాశనం చేస్తూ ఉద్యోగి అని చెప్పుకుంటూ పత్రికా రాతలు రాయగలను అని బెదిరించుకుంటూ వీసీ పేరు చెప్పుకొని మహిళలపై విరిచిపడుతున్నాడు. అనునిత్యం సాగుతున్న విని అరాచకాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన వీసి అట్టి అరాచక శక్తి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతి దాడికి సమాధానకర్తగా వ్యవహరిస్తూ తనే స్వయంగా దాడులు చేస్తున్న వ్యక్తులతో మాట్లాడుతుండడం ఆశ్చర్యంగా ఉంటుంది ఒక సామాజిక వర్గం ఎన్ని దాడులు చేసిన చర్యలు ఉండవు శిక్షలు ఉండవు కేసులు ఉండవు పోలీసుల బెదిరింపులు ఉండవు మిగతావారు కనీసం ప్రశ్నించిన ఉలిక్కిపడి వాళ్లపై దాడులు చేయిస్తూ వాళ్లపై కేసులు పెట్టి వాళ్లను అణచివేసే కార్యక్రమాలను మాత్రం అధికారులు స్వతహాగా దగ్గరుండి చేస్తున్నారు. అధికారులకు అన్ని తెలిసినప్పటికిని ఈ అధికార బ్రోకర్ గాని ఆగడాలకు వత్తాసు పలుకుతూ సహకరిస్తున్నారు తప్ప అరికడుతూ కేయూను కాపాడుకుందాం అనే ధ్యాస సోయి ఏమాత్రం కనపరచడం లేదు అయ్యా వీసీ గారు ఆ బ్రోకర్ ఎవరో నీకు తెలిసినప్పటికీ ఇంతలా వెనకేసుకొరావడానికి మీ అంతర్గత పరస్పర ఒప్పంద రహస్య సమాచార ఏమిటో కనీసం పత్రిక ముఖంగానైనా బాహ్య సమాజానికి తెలియజేయండని మేధావులు జర్నలిస్టులు కోరుతున్నారు. ప్రభుత్వము చర్యలు తీసుకోమని చెప్పిన కమిటీతో కాలయాపన చేస్తూ నిస్సిగ్గు కరంగా ప్రవర్తిస్తున్న కేయూ అధికారులు అట్టి కీచకుడు ప్రవర్తనతో కేయూలో మరెన్ని దారుణాలకు ఒడిగడతారో వేచి చూడాలి. కేవలం ఈ మధ్యకాలంలోనే హాస్టల్స్ లో వందకు పైగా కచరరాతలు 50 కి పైగా నిర్బంధ దాడులు చేయించిన అధికారులకు సిగ్గు రాకపోవడం విచారకరం. కమిటీలో కీచకుడికి కీలక బాధ్యతలు అప్పగించి చేతులు దులిపేసుకున్న కంట్రోలర్ కేయూ వీసీ రిజిస్ట్రార్ల పరువును నిట్ట నిలువునా చీలుస్తున్నాడని గుర్తించకపోవడం అత్యంత సిగ్గు కరం. కేవలం మహిళలను వేధించడం కోసమే ప్రెస్ కమిటీ మీడియాలో కీలక పదవిని కట్టబెట్టిన కంట్రోలర్ తన కుటుంబ సభ్యుల్లోని మహిళలకు ఇలాంటి కీచకుడు రూపంలో అన్యాయాలు జరుగుతే ఇలాగే ప్రవర్తించేవారా అంటూ విశ్వవిద్యాలయం మండిపడుతుంది. తక్షణమే కమిటీలో అట్టి బ్రోకర్ గాని మార్చమని హెచ్చరిస్తుంది. అధికారులు తమ అధికార నిజాయితీని కనపరుస్తారా లేక ఇద్దరు సన్నిహిత కీచకుల చేతిలో కీలుబొమ్మగా మారిపోతారా వేచి చూడాలి.

కొత్తగా 2,740 మందికి చేయూత పెన్షన్లు..





నెలకు రూ.69.89 లక్షల భరోసా!

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అర్హులకు పెన్షన్ ధ్రువపత్రాల పంపిణీ

ఈ నెల 19 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ..

అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం

వరంగల్, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వివిధ వృత్తులపై ఆధారపడిన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు.వరంగల్ ఎల్బీనగర్లోని ఏ1 కన్వెన్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన చేయూత పెన్షన్ ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కుడా చైర్పర్సన్ గుండు సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్నతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్ ధ్రువపత్రాలను అందజేశారు.

2,740 మందికి కొత్తగా పెన్షన్లు

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొత్త పెన్షన్ల కోసం మొత్తం 3,675 దరఖాస్తులు రాగా, వివిధ కేటగిరీలకు చెందిన 2,740 మందికి ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేసిందని కొండా సురేఖ వెల్లడించారు. వీటి ద్వారా నెలకు రూ.69,89,840 ఆర్థిక సహాయం లబ్ధిదారులకు అందనుందని తెలిపారు. కొత్తగా మంజూరైన వాటిలో 733 దివ్యాంగులు, 1,704 మంది వితంతువులు, 166 మంది వివాహిత ఒంటరి మహిళలు, 22 మంది అవివాహిత ఒంటరి మహిళలు, 98 మంది నేత కార్మికులు, 17 మంది తాటి గీత కార్మికులు ఉన్నారని వివరించారు.నియోజకవర్గంలో ఇప్పటికే 35,716 మంది వివిధ వర్గాల వారు చేయూత పెన్షన్లు పొందుతున్నారని తెలిపారు. పెన్షన్లు మంజూరు కాని అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మరోసారి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులైన వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.కొత్తగా మంజూరైన పెన్షన్ల మొత్తాన్ని ఈ నెల 19న నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించారు. అదే రోజు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించి అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని, సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి కూడా అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

జిల్లాలో 11,750 కొత్త పెన్షన్లు

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ వరంగల్ జిల్లా వ్యాప్తంగా కొత్తగా 11,750 చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని, వీటి ద్వారా నెలకు రూ. 2.09 కోట్ల ఆర్థిక సహాయం అందనుందని తెలిపారు. ఈ నెల 19న పెన్షన్ నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుందని వెల్లడించారు.కుడా చైర్పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలతో మహిళలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక భరోసా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనుండటం అభినందనీయమన్నారు.జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి.గణేష్, అదనపు కమిషనర్ ఇన్చార్జి సమ్మయ్య, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా పరిశ్రమల అధికారి నరసింహమూర్తి, ఎంహెచ్ డాక్టర్ రాజేష్, మాజీ కార్పొరేటర్ ఫుర్ఖాన్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరము

ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి -డాక్టర్ అనితా రెడ్డి



హన్మకొండ జై భీమ్ న్యూస్ :

బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా అనురాగ్ హెల్పింగ్ సొసైటీ మరియు వాచ్ చిల్డ్రన్ ఫోరం సంయుక్తంగా నిర్వహించారు, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో హన్మకొండ లోని స్పందన మానసిక దివ్యాంగుల , భదిరుల ఆశ్రమంలోని పిల్లలకు ఉచిత వైద్య శిబిరము నిర్వహించి, ఉచిత మందులను అందించడం జరిగింది, పిల్లలకు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ గారు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సూచనలు సలహాలు అందజేసారు, చలికాలం లో పిల్లల పట్ల ఆరోగ్యపరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియచేసారు, ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలని, పిల్లల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని , తల్లిదండ్రుల ఆదరణ కరువైన పిల్లలకు మనం మరింత ప్రేమ ఆప్యాయతలు అందించాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసామని అన్నారు, అందరి పిల్లలలాగానే మానసిక దివ్యాంగుల పిల్లలకు కూడా హక్కులు ఉంటాయని వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు, మానసిక దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని, వారి పట్ల జాలి చూపే కంటే ఆదరణ, చేయుతనందించాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు, ఈ కార్యక్రమం లో డాక్టర్ అనితా రెడ్డి, డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ గారు, రాసు సుధారెడ్డి, స్పందన సంస్థ నిర్వాహకులు సుచరిత, టీచర్స్ వసుధ, హరిత, పిల్లలు తదితరులు పాల్గొన్నారు. – డాక్టర్ అనితా రెడ్డి, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు.

చిన్నారి మహన్ష్ వర్ధన్ ప్రథమ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రాజనాల శ్రీహరి

దేశాయిపేటలో కంది భరత్ తనయుడికి ఆశీస్సులు అందజేత



వరంగల్, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని దేశాయిపేటకు చెందిన కంది భరత్ కుమారుడు చి. కంది మహన్ష్ వర్ధన్ ప్రథమ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు వరంగల్ గ్రేటర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి హాజరై చిన్నారి మహన్ష్ వర్ధన్ను ఆశీర్వదించి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్, బొల్లం మధు తదితరులు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఐఎంఏ రాష్ట్ర ఉత్తమ శాఖ కార్యదర్శి పురస్కారానికి డా. రామకృష్ణ ఎంపిక

కాకినాడ శాఖకు ఐదు రాష్ట్ర పురస్కారాలు.. డా. ఎ. సత్యవతికి రాష్ట్ర అధ్యక్షుడి ప్రశంసా పురస్కారం

కాకినాడ, నవంబర్ 17(జై భీమ్ న్యూస్)




ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ప్రకటించిన 2026 వార్షిక పురస్కారాల్లో కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యుడు డా. ఎస్.సీ. హెచ్.ఎస్. రామకృష్ణ రాష్ట్ర స్థాయి ఉత్తమ శాఖ కార్యదర్శి పురస్కారానికి ఎంపికయ్యారు. పెద్ద శాఖల విభాగంలో ఆయన ఈ పురస్కారానికి ఎంపిక కావడం కాకినాడ వైద్య వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఆయన ఐఎంఏ కాకినాడ శాఖ కార్యదర్శిగా, కాకినాడ కిమ్స్ ట్రస్ట్ ఆసుపత్రిలో చీఫ్ ఇంటెన్సివిస్ట్గా సేవలందిస్తున్నారు. ఐఎంఏ కాకినాడ శాఖ కూడా పలు విభాగాల్లో రాష్ట్ర స్థాయి గుర్తింపును సాధించింది. పెద్ద శాఖల విభాగంలో ఉత్తమ సమగ్ర పనితీరుకు ఒక పురస్కారంతో పాటు, ఎస్డబ్ల్యూసీ, ఆర్పీసీ, జోనల్ సమావేశాల నిర్వహణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో మరో రెండు పురస్కారాలకు ఎంపికైంది. అదేవిధంగా కాకినాడ శాఖ సభ్యురాలు డా. ఎ. సత్యవతి రాష్ట్ర అధ్యక్షుడి ప్రశంసా పురస్కారానికి ఎంపికయ్యారు. దీంతో కాకినాడ శాఖకు, దాని సభ్యులకు కలిపి మొత్తం ఐదు రాష్ట్ర స్థాయి పురస్కారాలు దక్కనున్నాయి. ఈ విజయంపై డా. రామకృష్ణ మాట్లాడుతూ, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా. జి.ఎస్. మూర్తి, ఐఎంఏ కాకినాడ శాఖ అధ్యక్షుడు డా. కడ వెంకటరమణ, శాఖ కార్యవర్గ సభ్యులు, వైద్య సభ్యుల సమిష్టి కృషి వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందని తెలిపారు. తనకు నిరంతరం సహకారం అందించిన కుటుంబ సభ్యులకు, కిమ్స్ ట్రస్ట్ ఆసుపత్రి సహచరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పురస్కారాలను నవంబర్ 21వ తేదీ శనివారం అమలాపురంలోని కిమ్స్లో నిర్వహించనున్న ఐఎంఏ ఏపీకాన్--2026 కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కార గ్రహీతలకు అవార్డులు అందజేయనున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

నల్లబెల్లిలో 600 మందికి కొత్తగా చేయూత పెన్షన్లు

నర్సంపేట నియోజకవర్గంలో మొత్తం 4,900 పెన్షన్లు మంజూరు.. మరో 400 దరఖాస్తులు పరిశీలనలో





నర్సంపేట, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నల్లబెల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన చేయూత పెన్షన్లకు సంబంధించి 600 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు దశాబ్దాల క్రితమే రూ.60తో పింఛన్ పథకాన్ని ప్రారంభించిందని, నేడు పెద్ద సంఖ్యలో పెన్షన్లు మంజూరు చేస్తూ పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో పెన్షన్లు మంజూరు చేయడం విశేషమని తెలిపారు.నర్సంపేట నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,900 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని, మరో 400 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. పరిశీలన అనంతరం అర్హులైన వారందరికీ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.కొత్తగా పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆక్వాన్ తుఫాను నేపథ్యంలో విద్యుత్ భద్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి
జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. తిలక్ కుమార్



రాజమహేంద్రవరం, నవంబర్ 17(జై భీమ్ న్యూస్)

ఆక్వాన్ తుఫాను ప్రభావంతో నవంబర్ 18 నుంచి 22వ తేదీ వరకు ఐదు రోజుల పాటు భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా ప్రజలు, విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. తిలక్ కుమార్ సూచించారు. తుఫాను సమయంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. తెగిపోయిన లేదా వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన లేదా విరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, వాటిలో విద్యుత్ ప్రవాహం ఉన్నట్లుగానే భావించి ఎట్టి పరిస్థితుల్లోనూ తాకడం లేదా సొంతంగా మరమ్మతులు చేయడానికి ప్రయత్నించకూడదని హెచ్చరించారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరే అవకాశం ఉన్నప్పుడు ముందుగానే ప్రధాన విద్యుత్ స్విచ్‌ను నిలిపివేయాలని, తడి చేతులతో స్విచ్‌లు, మీటర్లు, విద్యుత్ పరికరాలను తాకకూడదని సూచించారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో, ప్రజలు నీరు నిలిచిన ప్రాంతాల్లో విద్యుత్ పరికరాలను ఉపయోగించకూడదని, విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్న చెట్లు, చెట్ల కొమ్మలు, హోర్డింగ్‌లు, ఇనుప రాడ్లు వంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపడిన విద్యుత్ తీగలు, నీరు నిలిచిన ప్రాంతాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ స్తంభాలకు బ్యానర్లు, ఫ్లెక్సీలు, తాళ్లు, బట్టలు తదితర వస్తువులను కట్టకూడదని స్పష్టం చేశారు. తుఫాను సమయంలో ప్రజల భద్రత దృష్ట్యా విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉందని, అలాంటి సందర్భాల్లో ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని, భద్రతా తనిఖీలు పూర్తయిన అనంతరం సరఫరాను పునరుద్ధరిస్తామని వెల్లడించారు. విద్యుత్ ప్రమాదాలు, దెబ్బతిన్న విద్యుత్ పరికరాలు, తెగిపోయిన తీగలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే విద్యుత్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు తెలియజేయాలని, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే వరకు ప్రజలు సురక్షిత దూరంలో ఉండాలని సూచించారు. అత్యవసర సమాచారం కోసం 9493177540, 9440812706 నంబర్లలో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని తెలిపారు. ప్రజల భద్రతే విద్యుత్ శాఖ ప్రధాన లక్ష్యమని, ఆక్వాన్ తుఫాను నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. తిలక్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా జిల్లేపల్లి పవన్ నియామకం

విద్యార్థుల హక్కుల కోసం పోరాడిన యువ నాయకుడికి జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, వెనుకబడిన వర్గాల విద్యార్థుల సమస్యలపై గళమెత్తిన యువ నాయకుడు జిల్లేపల్లి పవన్‌కు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు లభించాయి. ఆయన జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అలాగే తెలంగాణ సమాచార సాంకేతిక పరిజ్ఞాన సంఘం యువజన అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో విద్యార్థుల విద్యా హక్కులు, ఉపకార వేతనాలు, వసతి గృహాల సౌకర్యాలు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆయన నిరంతరం పోరాటం చేశారు. పలు ఉద్యమాలు, కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విద్యార్థుల సమస్యల



పరిష్కారానికి కృషి చేశారు. ప్రస్తుతం గూగుల్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూనే సామాజిక బాధ్యతను కొనసాగిస్తున్నారు. బీసీ ఉద్యమ నేత, గౌరవ రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఉద్యమ స్ఫూర్తితో, డా. ర్యాగ అరుణ్ కుమార్ మార్గదర్శకత్వంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బీసీ యువతను సంఘటితం చేయడమే తన ప్రధాన లక్ష్యమని పవన్ తెలిపారు. యువతకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక సాధికారత రంగాల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత, వెనుకబడిన వర్గాల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో యువజన చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్యకు, డా. ర్యాగ అరుణ్ కుమార్‌కు జిల్లేపల్లి పవన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి మార్గదర్శకత్వంలో యువత అభ్యున్నతి, బీసీ హక్కుల సాధన, సామాజిక న్యాయం, సమాజ అభివృద్ధి కోసం మరింత బాధ్యతతో పనిచేస్తానని స్పష్టం చేశారు. విద్యార్థి ఉద్యమాల నుంచి జాతీయ స్థాయి నాయకత్వం వరకు జిల్లేపల్లి పవన్ ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, కచ్చితంగా జరగాలి





ఎస్ఐఆర్ రోల్ పరిశీలకురాలు హరిచందన

హన్మకొండ, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకురాలు హరిచందన అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు తుది జాబితాలో చోటు కల్పించాలని, ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మంగళవారం హనుమకొండకు విచ్చేసిన ఓటర్ల జాబితా పరిశీలకురాలు హరిచందన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అమలును పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు నిర్వహించిన ఇంటింటి సర్వే వివరాలు, అభ్యంతరాలు, క్షేత్రస్థాయి విచారణలు, పరిశీలన నివేదికలను సమీక్షించారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, వివరాల మార్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను సక్రమంగా పరిష్కరించారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, రెండు చోట్ల ఓటు కలిగి ఉన్న వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే సమయంలో ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎన్నికల నమోదు అధికారులు ఆమోదించిన, తిరస్కరించిన దరఖాస్తులను కూడా ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. ప్రత్యేక సమగ్ర సవరణ మొదటి విడతలో మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, రెండు చోట్ల ఓటు కలిగి ఉన్న మొత్తం 1,01,697 మంది పేర్లను గుర్తించి ప్రత్యేక జాబితాలో చేర్చినట్లు తెలిపారు. రెండో విడత నోటీసుల ప్రక్రియలో భాగంగా 970 మందిని అనర్హులుగా గుర్తించినట్లు వివరించారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, వివరాల మార్పులకు సంబంధించిన దరఖాస్తులు ఏవీ పెండింగ్‌లో లేవని, నోటీసుల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తయిందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి విచారణల సమయంలో బూత్ స్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధులు కూడా పాల్గొంటున్నారని కలెక్టర్ తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి గురువారం సమావేశాలు నిర్వహిస్తూ, ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన తాజా సమాచారం, ఓటర్ల జాబితాలను ఎప్పటికప్పుడు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక జాబితాలను ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో కూడా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఓటర్లు తమ పేర్లు, వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే ఓటర్లలో ఎన్నికలపై అవగాహన పెంపొందించేందుకు ఎన్నికల అక్షరాస్యత సంఘం ఆధ్వర్యంలో క్విజ్, వ్యాసరచన పోటీలను బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, ఆర్డీఓ వెంకటేష్, హనుమకొండ, భూజీపేట తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, రాజు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు జగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



పురాతన నాణేలు, కరెన్సీ నోట్లు, పోస్టల్ స్టాంపుల ప్రదర్శన





విద్యార్థులను ఆకట్టుకున్న అరుదైన చారిత్రక వస్తువులు

రాజమహేంద్రవరం, నవంబర్ 17(జై భీమ్ న్యూస్)

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రాజమహేంద్రవరంలోని శ్రీ గౌతమి ప్రాంతీయ గ్రంథాలయంలో మంగళవారం పురాతన నాణేలు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు, పోస్టల్ స్టాంపులతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అల్లు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శన విద్యార్థులను, గ్రంథాలయ పాఠకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు, పురాతన నాణేలు, అరుదైన పోస్టల్ స్టాంపులను ప్రదర్శనకు ఉంచారు. అదేవిధంగా మహాత్మా గాంధీజీ ఉపయోగించిన వాచీ, అమెరికాలో పది కోట్ల పుస్తకాలు కలిగిన గ్రంథాలయం తదితర చారిత్రక విశేషాలను తెలియజేసే విలువైన చిత్రాలను ఏర్పాటు చేశారు. ప్రదర్శనలోని ప్రతి వస్తువు ప్రత్యేకతను, వాటి చారిత్రక నేపథ్యాన్ని అల్లు రామకృష్ణ విద్యార్థులకు వివరించారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు సూర్యదీప్ పాఠశాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులతో పాటు ఇతర పాఠశాలలకు చెందిన మరో 50 మంది విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ప్రదర్శనను వీక్షించి పురాతన నాణేలు, వివిధ దేశాల కరెన్సీలు, పోస్టల్ స్టాంపుల గురించి ఆసక్తికరమైన విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు 'గాంధీజీ జీవిత చరిత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో మహాత్మా గాంధీ జీవిత చరిత్ర, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్ర, అహింసా సిద్ధాంతాలపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో ఈ పోటీలు చేపట్టారు. ఈ సందర్భంగా అరుదైన పురాతన నాణేలు, కరెన్సీ నోట్లు, పోస్టల్ స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేసి విద్యార్థులకు చారిత్రక అంశాలపై అవగాహన కల్పించిన అల్లు రామకృష్ణను గ్రంథాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. వ్యాసరచన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు నవంబర్ 20న జరిగే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయాధికారి ఘంటా శ్రీదేవి తెలిపారు. ఇదిలా ఉండగా, 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 18న ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు 'మీకు నచ్చిన చిత్రం' అనే అంశంపై చిత్రలేఖన పోటీలు, ఆరవ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు 'నేర్చుకోడానికి చదవండి -- నాయకత్వం వహించడానికి నేర్చుకోండి' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం.. హసన్‌పర్తి పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం

ఎస్.ఆర్. యూనివర్సిటీ సమీపంలో బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఆసుపత్రికి తరలించేలోపే మృతి

హసన్‌పర్తి, నవంబర్ 17(జై భీమ్ న్యూస్)

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్.ఆర్. యూనివర్సిటీ సమీపంలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా జరిగిన ప్రమాదంలో పనుగంటి వినయ్ రెడ్డి (20) అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని లారీ బలంగా ఢీకొట్టడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన పనుగంటి వినయ్ రెడ్డి ఎల్కతుర్తిలోని ఓ పెట్రోల్ బంక్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగానే మంగళవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనం (టీజీ-03-బీఏ-2196)పై ఇంటి నుంచి పెట్రోల్ బంక్‌కు విధులకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఉదయం 9.30 గంటల ప్రాంతంలో హసన్‌పర్తి పరిధిలోని ఎస్.ఆర్. యూనివర్సిటీ దాటి వెళ్తుండగా, ఎల్కతుర్తి వైపు నుంచి హనుమకొండ వైపు వస్తున్న లారీ (టీఎస్-05-యూబీ-8568) డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడుపుతూ వినయ్ రెడ్డి ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాద తీవ్రతకు యువకుడు బైక్‌పై నుంచి వెనుక వైపు వస్తున్న కారుపై పడిపోయాడు. దీంతో అతడి తల, కాళ్లు సహా శరీరంలోని పలు భాగాలకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం



అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది తీవ్రంగా గాయపడిన వినయ్ రెడ్డిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునే సమయానికే యువకుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో దండేపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతుడి తల్లి పనుగంటి అనూరాధ (భర్త స్వర్గీయ సాయిరెడ్డి) ఇచ్చిన ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు. యువకుడి అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. విధులకు వెళ్తూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిన కుమారుడి మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వాహనదారులు రహదారులపై ప్రయాణించేటప్పుడు వేగ నియంత్రణ పాటిస్తూ, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో పొరపాట్లకు తావివ్వొద్దు

అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కవరేజీ - కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, నవంబర్ 17(జై భీమ్ న్యూస్)

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో పాటిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కవరేజీ కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత జిల్లా అధికారులతో పాటు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు, అర్హుల గుర్తింపు, దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన సభ్యుల్లో ఒకరికి మాత్రమే ఈ జీవిత బీమా వర్తిస్తుందని తెలిపారు. రేషన్ కార్డులు కలిగిన కుటుంబాల వివరాలు ఇప్పటికే అందుబాటులో ఉన్న సమాచారంతో ముందుగా నింపిన దరఖాస్తుల రూపంలో ఉంటాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన వివరాలను పూర్తిచేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసిన అనంతరం ప్రింట్‌అవుట్ తీసుకొని లబ్ధిదారుల సంతకాలు సేకరించి హార్డ్ కాపీలను భద్రపరచాలని ఆదేశించారు. రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలను ప్రత్యేక దరఖాస్తుల ద్వారా సేకరించి, అర్హతలను పరిశీలించిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల నమోదు సమయంలో ఆధార్ ఆధారిత ఓటీపీతో పాటు బయోమెట్రిక్ ధ్రువీకరణకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ప్రత్యేక కౌంటర్‌లో బయోమెట్రిక్



పరికరాలు, కంప్యూటర్లు, ప్రింటర్లు అందుబాటులో ఉంచడంతో పాటు వాటి పనితీరును ముందుగానే పరిశీలించాలని తెలిపారు. ఆధార్ కార్డు ప్రతిపై సంబంధిత లబ్ధిదారుడి సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా జీవిత బీమా పథకంలో నామినీ వివరాలు అత్యంత కీలకమని పేర్కొంటూ, లబ్ధిదారులు ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా పేర్కొన్నప్పుడు వారికి కేటాయించే వాటాల మొత్తం 100 శాతం ఉండేలా చూడాలని ఆదేశించారు. మైనర్లను నామినీలుగా ఎంపిక చేసిన సందర్భంలో నిబంధనల ప్రకారం గార్డియన్ వివరాలను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ప్రజలు తమ నివాస ప్రాంతానికి కేటాయించిన ప్రత్యేక కౌంటర్లలోనే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన వారు వేర్వేరు ప్రాంతాల్లో దరఖాస్తులు నమోదు చేయకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అధిక జనాభా కలిగిన గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మేరకు అదనపు కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రత్యేక కౌంటర్లకు వచ్చే ప్రజలకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తుల నమోదు ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేసేందుకు ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించాలని, గ్రామపంచాయతీ, మండల, రెవెన్యూ డివిజన్, జిల్లా స్థాయిల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల కమిషనర్లు, వివిధ మండలాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన లబ్ధిదారులందరికీ పథకం ప్రయోజనం అందేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ నుంచి నమోదు ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి దశలో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానం పాటించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, సీపీఓ చంద్రకళ, డీపీవో కల్పన, డీసీఎస్‌వో కిష్టయ్య, డీఎం సివిల్ సప్లై సంధ్యారాణి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రంజిత్‌తో పాటు వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందిస్తాం!

మహిళా సాధికారత, పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎంపీ డా. కడియం కావ్య

ఐనవోలు, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గం ఐనవోలు మండలం నందనంలోని ఎఫ్ఎస్‌సీఎస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుతో కలిసి నూతన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, రైతు సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలుస్తోందన్నారు. వర్ధన్నపేట, ఐనవోలు మండలాలు, వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో సుమారు 1,400 మందికి నూతన పింఛన్లు అందించడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలని, ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే రూ. 1.30 కోట్ల ఎంపీ నిధులు కేటాయించామని, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుతో కలిసి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, పింఛన్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



రైఫిల్ షూటింగ్‌లో సత్తాచాటిన ఆశ్రిత.. రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకం

ఏపీ తరఫున జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

విద్యార్థిని అనుసూరి ఆశ్రితను అభినందించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



కాకినాడ, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన విద్యార్థిని అనుసూరి ఆశ్రిత అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించింది. తన అసాధారణ ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో పాటు, త్వరలో గోవాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని దక్కించుకుంది. నెల్లూరులో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-17 బాలికల రైఫిల్ షూటింగ్ విభాగంలో కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన అనుసూరి ఆశ్రిత పాల్గొని తన ప్రతిభను చాటుకుంది. ప్రత్యర్థులతో పోటీపడి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. కాకినాడలోని మోహన్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆశ్రిత, రాష్ట్ర స్థాయిలో సాధించిన ఈ విజయంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆశ్రిత తన తల్లిదండ్రులతో కలిసి కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఆశ్రితను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆశ్రిత ఇదే స్ఫూర్తితో మరింత పట్టుదల, క్రమశిక్షణతో సాధన కొనసాగించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభను నిరూపించుకోవడానికి నిరంతర సాధన, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి కాకినాడ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆశ్రితకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఆశ్రిత క్రీడా ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది.

పీఆర్సీ అమలు, పాత పెన్షన్ పునరుద్ధరణకు టీఎస్ యూటీఎఫ్ డిమాండ్





హసన్‌పర్తి, నవంబర్ 17(జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హసన్‌పర్తి మండలంలోని దేవన్నపేట, సుబ్బయ్యపల్లి గురుకుల పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆరు నెలల్లోపు పీఆర్సీ అమలు చేస్తామని, పెండింగ్ డీఏలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి 40 నెలలు గడిచినా ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. వెంటనే పీఆర్సీ నివేదికను బహిర్గతం చేసి అమలు చేయాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంరక్షణ, నిర్వహణ కోసం కేర్‌టేకర్లు, వార్డెన్లను నియమించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు అప్పగించకుండా విద్యాబోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ గురుకుల పాఠశాలల పనివేళలను మార్చాలని సూచించారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో విధానం ద్వారా వేతనాలు మంజూరు చేయాలని కోరారు. కేజీబీవీ సిబ్బందికి కనీస కాలపరిమితి వేతన విధానాన్ని అమలు చేయాలని అన్నారు. ప్రాథమిక విద్యారంగాన్ని ప్రభావితం చేసే జీవో నంబర్ 25ను వెంటనే రద్దు చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని పెండెం రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ హసన్‌పర్తి మండల శాఖ అధ్యక్షురాలు రమాదేవి, ప్రధాన కార్యదర్శి నరేష్, సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

ప్రభుత్వ పథకాలు ప్రతి దివ్యాంగ విద్యార్థికి అందేలా చర్యలు

జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి





వరంగల్, నవంబర్ 17(జై భీమ్ న్యూస్)

ప్రత్యేక అవసరాలు కలిగిన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పథకాలు, విద్యా సదుపాయాలు, అవసరమైన సహాయ సహకారాలు అందేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి సూచించారు. వరంగల్ జిల్లా పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మంగళవారం ఖిలా వరంగల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శంభునిపేటలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని 13 మండలాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిపి సుమారు 150 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్యాభివృద్ధి, సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పథకాలు అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఉన్న వివిధ రకాల వైకల్యాలను గుర్తించేందుకు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ప్రశస్తి యాప్ ద్వారా స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసి అవసరమైన విద్యార్థులకు ప్రత్యేక విద్యా సహాయం, మద్దతు సేవలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా సమ్మిళిత విద్యా సమన్వయకర్త డాక్టర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదల, పరస్పర సహకారం పెంపొందుతాయని వివరించారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక రంగంలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజంపై ఉందన్నారు. సరైన శిక్షణ, ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించగలరని, పారాలింపిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక వేదికలపై దేశానికి పేరు తీసుకురాగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, స్వతంత్రంగా వ్యవహరించే సామర్థ్యం, సామాజిక సమ్మిళితత్వాన్ని పెంపొందించేందుకు గొప్ప వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. అనంతరం పీఈటీల ఆధ్వర్యంలో మొత్తం 12 రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. 13 మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా పోటీల్లో పాల్గొనే అవకాశాలు కల్పించారు. పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు మెమెంటోలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహకంగా పాల్గొన్న ధ్రువీకరణ పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళికా సమన్వయకర్త విజయ్ కుమార్, ఖిలా వరంగల్ మండల విద్యాధికారి వెంకటయ్య, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఫీక్, సమ్మిళిత విద్యా వనరుల ఉపాధ్యాయులు, ప్రత్యేక విద్యాబోధకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి.

దాసరి హరిచందనకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న స్వాగతం



హనుమకొండ,17 నవంబర్ (జై భీమ్ న్యూస్)

ఉమ్మడి వరంగల్ జిల్లా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) రోల్ అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి దాసరి హరిచందనను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి. వెంకన్న మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో ఆమెను కలిసి పూల మొక్కను అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రోల్ అబ్జర్వర్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లాకు వచ్చిన దాసరి హరిచందనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)కు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణ, ఓటర్ల జాబితా ప్రామాణికత, పారదర్శకతకు రోల్ అబ్జర్వర్ పర్యవేక్షణ కీలకంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో కమిషనర్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలకడం ప్రాధాన్యత సంతరించుకుంది.

బల్దియాలో జీతాలకు 'జీవో' కత్తెర !

1181 జీవోతో బల్దియా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు భారీ కోత!

ఒకే విధులు.. ఒకే బాధ్యతలు.. అయినా జీతాల్లో వ్యత్యాసాలెందుకు?

రూ.22,750 నుంచి రూ.16,600కు వేతనం తగ్గింపు..

నెలకు రూ.6,150 కోత !

మరికొందరికి రూ.3,250 కోత..

ఏళ్ల తరబడి చేసిన సేవలకు గుర్తింపు లేదా?

సీనియార్టీ పెరుగుతే జీతాలు పెరుగుతాయి కానీ ఇక్కడ జీతాలు తగ్గుతాయి

పాత వేతనాలైనా కొనసాగించాలని ఉద్యోగుల వేడుకోలు..

కూలి పనులకు వెళ్తున్న కార్మికులు!

వరంగల్ | నవంబర్ 17 | జై భీమ్ న్యూస్

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో 1181 జీవో అమలు కొత్త సమస్యలను సృష్టిస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. నగర పరిశుభ్రత నుంచి వివిధ విభాగాల విధుల వరకు ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న కార్మికులకు కొత్త వేతన విధానం ఆర్థిక భారంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే రకమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ పీహెచ్ వర్కర్లుగా కేటగిరీ మార్చి వేతనాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

రూ.6,150 వరకు నెలవారీ ఆదాయానికి గండి!

ఉద్యోగులు వెల్లడిస్తున్న వివరాల ప్రకారం గతంలో నెలకు రూ.22,750 వేతనం పొందిన కొందరికి ప్రస్తుతం రూ.16,600గా నిర్ణయించారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరికి రూ.19,500గా వేతనం నిర్ణయించినట్లు చెబుతున్నారు. దీంతో గత వేతనంతో పోలిస్తే నెలవారీ ఆదాయంలో భారీ వ్యత్యాసం ఏర్పడుతోంది.

వేతనాల్లో కోతల లెక్కలు ఇలా ఉన్నాయి.

గతంలో పొందిన వేతనం। ప్రస్తుతం నిర్ణయించిన వేతనం। నెలవారీ నష్టం రూ.22,750। రూ.16,600। రూ.6,150 రూ.22,750। రూ.19,500। రూ.3,250

ఈ లెక్కల ప్రకారం ఏడాదికి మొదటి కేటగిరీలో రూ.73,800, రెండో కేటగిరీలో రూ.39,000 ఆదాయం తగ్గుతుంది. ఉద్యోగుల ఆరోపణల ప్రకారం మరికొందరికి నెలకు రూ.2 వేల నుంచి రూ.6 వేలకుపైగా కోత పడుతోంది. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చుల మధ్య ఈ ఆదాయ తగ్గింపు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మరింత ఇబ్బందుల్లోకి నెడుతోందని కార్మికులు వాపోతున్నారు.

సీనియారిటీకి విలువ ఎక్కడ?

ఇక్కడ ప్రధానంగా తలెత్తుతున్న ప్రశ్న ఉద్యోగుల సీనియారిటీకి సంబంధించినది. పదేళ్లు, పదిహేనేళ్లు, ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికుల సేవాకాలం, అనుభవం, గతంలో పొందుతున్న వేతనాలను పరిగణనలోకి తీసుకున్నారా? లేక కొత్త కేటగిరీ పేరుతో అందరికీ ఒకే విధమైన వేతన విధానాన్ని అమలు చేస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఒక ఉద్యోగి ఎన్నో సంవత్సరాల పాటు సంస్థకు సేవలందించిన తర్వాత కేవలం కేటగిరీ మార్పుతో అతని వేతనం తగ్గిపోతే కుటుంబ పోషణ ఎలా సాధ్యమవుతుందన్నది ఉద్యోగుల ఆవేదన. సమానమైన పని చేస్తున్నప్పుడు వేతనాల్లో వ్యత్యాసాలకు కారణాలను అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.2021లో జారీ చేసిన జీవో నంబర్లు 60, 63 ప్రకారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన మార్గదర్శకాలు ఉన్న నేపథ్యంలో, ప్రస్తుతం 1181 జీవో అమలులో అనుసరిస్తున్న విధానం ఏమిటో అధికారులు వెల్లడించాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఏ ప్రాతిపదికన పీహెచ్ వర్కర్లుగా వర్గీకరించారు? గతంలో చెల్లించిన వేతనాలను తగ్గించడానికి కారణాలేమిటి? సీనియారిటీకి అనుగుణంగా వేతనాలను పరిగణనలోకి తీసుకున్నారా? ఒకే విధులు నిర్వహించే ఉద్యోగుల మధ్య వేతన వ్యత్యాసాలకు కారణాలేమిటి? అనే అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగం చేస్తున్నా కుటుంబ పోషణ భారమే!

జై భీమ్ న్యూస్ అధికార ప్రతినిధి హన్మకొండ శ్రీకాంత్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కలిసినప్పుడు పలువురు ఉద్యోగులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, గతంలో వచ్చిన వేతనంతోనే కుటుంబాలను పోషించడం కష్టంగా ఉండేదని, ఇప్పుడు మరింత కోత విధించడంతో పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు. కొందరు ఉద్యోగులు జీవనోపాధి కోసం కూలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఉద్యోగం చేస్తున్నా కుటుంబ అవసరాలు తీరడం లేదని, తమకు గతంలో అందుతున్న వేతనాలనే కొనసాగించాలని బాధలను చెప్పుకున్నారు.

కమిషనర్ దృష్టికి ఉద్యోగుల విజ్ఞప్తి!

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉద్యోగులు కోరుతున్నారు. 1181 జీవో అమలుతో ఏర్పడిన వేతన వ్యత్యాసాలు, కేటగిరీల మార్పులు, సీనియారిటీ పరిగణన, ఏజెన్సీల ద్వారా జరుగుతున్న వేతన చెల్లింపులపై సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వేతనాల తగ్గింపునకు సంబంధించిన పూర్తి వివరాలను ఉద్యోగుల సమక్షంలో వెల్లడించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిరోజూ శ్రమించే కార్మికుల కుటుంబాల్లోనే ఆర్థిక ఇబ్బందుల చీకట్లు అలుముకుంటే వారి సేవలకు గుర్తింపు ఎక్కడ? బల్దియా అభివృద్ధిలో భాగస్వాములవుతున్న ఉద్యోగుల జీవన భద్రతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. జీవో అమలు పేరుతో ఏళ్ల తరబడి సేవలందించిన ఉద్యోగుల జీవనాధారం దెబ్బతినకుండా, వేతన కోతలపై పునఃపరిశీలన జరగాల్సిన అవసరం ఉంది. కమిషనర్ గారూ.. ఉద్యోగుల గోడు వినండి! రూ.3,250 నుంచి రూ.6,150 వరకు నెలవారీ వేతన నష్టాన్ని పరిగణనలోకి తీసుకోండి. వారి సీనియారిటీకి తగిన గుర్తింపు ఇవ్వండి. పాత వేతనాలను కొనసాగించే అంశాన్ని పరిశీలించి, కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించండి.



టౌన్ ప్లానింగ్‌లో ఎవరి రాజ్యం?

'సలాం.. నజరానా' లేకుంటే పనులు జరగవా?

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల నుంచి చైన్‌మెన్ల వరకు ఒత్తిళ్ల ఆరోపణలు..

కమిషనర్ విచారణకు డిమాండ్!

గ్రేటర్ వరంగల్ | నవంబర్ 17 | జై భీమ్ న్యూస్

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అసలు ఏం జరుగుతోంది? ప్రజలకు సేవలందించాల్సిన కార్యాలయంలో కొందరి వ్యక్తిగత పెత్తనం కొనసాగుతోందా? ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగంలో చేరిన, కాలక్రమేణా కార్యాలయ వ్యవహారాల్లో తనకంటూ ప్రత్యేక ప్రభావాన్ని ఏర్పరచుకున్నారనే ప్రచారం వినిపిస్తోంది. బయట నుంచి వచ్చే వ్యక్తులకు అడ్వకేట్ అని పరిచయం చేసుకోవడం నుంచి కార్యాలయ పనులపై ప్రభావం చూపడం వరకు ఆయన వ్యవహారశైలిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సలాములు, నజరానాలు, బహుమతుల పేరుతో ఉద్యోగులపై ఒత్తిళ్లు తెస్తున్నారనే ఆరోపణలు టౌన్ ప్లానింగ్ వర్గాల్లో చర్చనీయా అంశము. ఈ వ్యవహారం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకే పరిమితం కాకుండా చైన్‌మెన్ల వరకు చేరిందనే ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. కార్యాలయంలో పని పూర్తయిన తర్వాత సంబంధిత వ్యక్తుల వద్దకు చైన్‌మెన్లను పంపించి పైకం తీసుకురావాలని సూచిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఆశించిన మొత్తం అందకపోతే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధులు నిర్వహించాల్సిన క్షేత్రస్థాయి సిబ్బంది ఆర్థిక లావాదేవీలకు మధ్యవర్తులుగా మారుతున్నారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.మరోవైపు విభాగంలో పనిచేస్తున్న 22 మంది బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల విధుల కేటాయింపులు, వారి పరిధిలో జరిగే పనులు, ఆర్థిక లావాదేవీలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రేసుగుర్రానికి సంబంధించిన వ్యవహారాల్లో కొందరు ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేకంగా సహకరిస్తున్నారనే ప్రచారం ఉంది. ఇటీవల జరిగిన ఒక చిన్న ప్రమాదం నేపథ్యంలో కూడా ఇన్‌స్పెక్టర్లు పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందించారనే చర్చ వినిపిస్తోంది. అది స్వచ్ఛంద సహాయమా? లేక ఉద్యోగులపై ఉన్న ఒత్తిళ్ల ఫలితమా? అన్నది స్పష్టతకు రావాలి.ఇదిలా ఉంటే టౌన్ ప్లానింగ్ విభాగంలో నాయక్ కు రేసుగుర్రానికి మధ్య కొనసాగుతున్న విభేదాలు కూడా చర్చకు వస్తున్నాయి. వీరి మధ్య వివాదం విధుల నిర్వహణకు సంబంధించినదా? లేక ఆర్థిక వ్యవహారాలే కారణమా? అన్న ప్రశ్నలు ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మరోవైపు ఆశించిన మొత్తం అందలేదనే కారణంతో గతంలో ఒక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి ఇంటి గోడ కూల్చివేయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సదరు నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉందా? కూల్చివేతకు అధికారిక ఆదేశాలు ఉన్నాయా? లేక ఇతర కారణాలు ప్రభావం చూపాయా? అన్నది సంబంధిత రికార్డుల పరిశీలనతో తేలాల్సి ఉంది.కార్యాలయ సమయం ముగిసిన తర్వాత కూడా లీగల్ సెల్‌లో ప్రత్యేక సమావేశాలు జరుగుతున్నాయనే ప్రచారం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఆ సమావేశాల ఉద్దేశం ఏమిటి? ఎవరి ఆదేశాలతో నిర్వహిస్తున్నారు? వాటికి సంబంధించిన అధికారిక రికార్డులు ఉన్నాయా? అన్నది పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఇన్ని ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ ఉందన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఈ వ్యవహారాలు ఎల్ఓ దృష్టికి వచ్చాయా? తెలిసి కూడా మౌనం వహిస్తున్నారా? అన్నది స్పష్టతకు రావాలి.బల్దియా అనేది ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ వ్యవస్థ. ఉద్యోగుల నుంచి సలాములు ఆశించే వేదిక కాదు.. ప్రజల పనుల కోసం నజరానాలు సమర్పించే దర్బారు అంతకంటే కాదు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి 22 మంది బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల విధుల కేటాయింపులు, చైన్‌మెన్ల పనితీరు, ఫైళ్ల కదలిక, కూల్చివేతల రికార్డులు, లీగల్ సెల్ సమావేశాలు, సంబంధిత ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి వివరణ తీసుకుని వాస్తవాలను వెల్లడించాలి. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.సలాముల వెనుక స్వార్థం ఎంత? నజరానాల వెనుక నెట్‌వర్క్ ఎంత? చైన్‌మెన్లను ఎవరు నడిపిస్తున్నారు? 22 మంది బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లపై ఎవరి పెత్తనం?లి ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరికే వరకు టౌన్ ప్లానింగ్ విభాగంపై అనుమానాలు తొలగే పరిస్థితి లేదు. రేసుగుర్రం పరుగులకు కళ్లెం పడుతుందా? లేక ఈ ఆరోపణలపై కూడా ఫైళ్లు మౌనంగా ఉండిపోతాయా? కమిషనర్ విచారణతోనే అసలు నిజాలు వెలుగులోకి రావాల్సి ఉంది.



కృత్రిమ మేధా యుగంలోనూ పుస్తక పఠనం కీలకం

పింగిళి కళాశాలలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

వడ్డేపల్లి, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత విస్తరిస్తున్నప్పటికీ పుస్తక పఠనం, గ్రంథాలయాల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదని ద్రవిడియన్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డా. ఎం. అంజయ్య అన్నారు. హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన, గ్రంథపాలకుడు డా. బి. యుగంధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంజయ్య మాట్లాడుతూ విద్యార్థినులు పుస్తకాలు, దినపత్రికలు, మ్యాగజైన్లు, జర్నల్స్ చదవడం ద్వారా జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, పోటీ పరీక్షలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను కళాశాల గ్రంథాలయానికి అందజేస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థినుల విజయాల్లో గ్రంథాలయాల పాత్ర కీలకమని, పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కళాశాల గ్రంథాలయంలో పుస్తకాలతో పాటు ఈ-బుక్స్, ఈ-జర్నల్స్, డిజిటల్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథపాలకుడు యుగంధర్ తెలిపారు. ఈ సందర్భంగా వెలుదండి రవికుమార్ రచించిన అండర్‌స్టాండింగ్ ద స్టూడెంట్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



రేషన్ డీలర్‌షిప్‌లలో అక్రమాల కలకలం!

జీవో నంబర్ 20 ఆధారంగా అక్రమాలకు తెర.. అర్హతలపై అనుమానాలు.. రాజకీయ ఒత్తిళ్లతో వెనకడుగు!

వరంగల్ । నవంబర్ 17 । జై భీమ్ న్యూస్

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో రేషన్ డీలర్‌షిప్‌ల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. అర్హతలు, నిబంధనలకు విరుద్ధంగా కొందరు రేషన్ డీలర్లుగా కొనసాగుతున్నారనే ఆరోపణలు చర్చకు దారితీస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి డీలర్‌షిప్‌లు కేటాయించాల్సి ఉండగా, కొందరు నిబంధనలను తమకు అనుకూలంగా మలుచుకుని పదవులు పొందారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జీవో నంబర్ 20 ఆధారంగా జరిగిన కేటాయింపులపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 1998కు ముందు నుంచి లైసెన్సులు కలిగి ఉన్నవారికి సంబంధించిన నిబంధనలను ఆసరాగా చేసుకుని కొందరు డీలర్‌షిప్‌లను పొందారనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ కేటాయింపుల వెనుక అధికారుల పాత్ర ఏమిటి? నిబంధనలను పూర్తిస్థాయిలో పరిశీలించారా? అర్హతల నిర్ధారణలో పారదర్శకత పాటించారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మరోవైపు డీలర్‌షిప్‌ల వ్యవహారంలో రాజకీయ ఒత్తిళ్లు కూడా ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముగ్గురి డీలర్‌షిప్‌ల రద్దు, అక్రమాలపై చర్యల విషయంలో అధికారులు వెనకడుగు వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాల్సిన రేషన్ వ్యవస్థ వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ పలుకుబడికి వేదిక కాకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జీవో నంబర్ 20 కింద జరిగిన నియామకాలు, డీలర్‌షిప్‌ల అర్హతలు, లైసెన్సుల జారీ ప్రక్రియపై



ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. అర్హులకు న్యాయం జరిగేలా, అక్రమాలకు తావులేకుండా రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.

కిరోసిన్ హాకర్లకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి.. ఇదే వారి జీవనాధారం!

ఇదే సమయంలో రద్దయిన మూడు రేషన్ డీలర్‌షిప్‌ల భర్తీ విషయంలో ప్రభుత్వం మానవీయ కోణంలోనూ ఆలోచించాల్సిన అవసరం ఉంది. గతంలో కిరోసిన్ హాకర్లుగా పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన వారికి డీలర్‌షిప్‌ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత కల్పించాలని సంబంధిత వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. కిరోసిన్ హాకర్ల జీవనోపాధి ప్రధానంగా ఈ వృత్తిపైనే ఆధారపడి ఉండేదని, కాలక్రమేణా మారిన పరిస్థితులతో వారి ఉపాధి దెబ్బతిన్నదని పేర్కొంటున్నారు. అలాంటి వారికి తిరిగి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. అందువల్ల రద్దయిన మూడు డీలర్‌షిప్‌ల భర్తీలో అర్హతలు, ప్రభుత్వ మార్గదర్శకాలు, వర్తించే రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా గతంలో కిరోసిన్ హాకర్లుగా పనిచేసిన వారికి తొలి ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ రంగాన్నే నమ్ముకుని జీవించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరుతున్నారు. అక్రమాలకు తావులేకుండా అర్హులకు న్యాయం చేయడమే కాకుండా, ఉపాధి కోల్పోయిన కిరోసిన్ హాకర్లకు జీవనోపాధి కల్పించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా? అన్నది వేచి చూడాలి.

రైస్ మిల్లు ఓనర్- రేషన్ షాప్ డీలర్. తరువాయి సంచికలో...

సౌత్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కేయూ జట్టు



కేయూ క్యాంపస్, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్) :

చెన్నైలోని వినాయక మిషన్స్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2026--27 సంవత్సరానికి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్ ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయం మహిళల వెయిట్ లిఫ్టింగ్ జట్టు తరపున ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎం. అనూష పాల్గొననున్నారు. జట్టు మేనేజర్‌గా ఎంజేపీటీబీసీ లా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి. ప్రవంతి వ్యవహరించనున్నారు. ఈ వివరాలను యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డా. టి. శాస్త్రీ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

పోటీ పరీక్షల్లో విజయానికి మానసిక సంసిద్ధత కీలకం

సానుకూల ఆలోచన, ఆత్మవిశ్వాసం, సమయపాలనతో విజయం సాధించవచ్చు : డా. శ్రీనివాస్ అడ్డిగా



కేయూ క్యాంపస్, 17 నవంబర్ (జై భీమ్ న్యూస్)

పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే సానుకూల ఆలోచనా విధానం, ఆత్మవిశ్వాసం, సమయపాలన, ఒత్తిడి నిర్వహణ ఎంతో కీలకమని సైకాలజిస్ట్, కార్పొరేట్ శిక్షకులు డా. శ్రీనివాస్ అడ్డిగా అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ‘పోటీ పరీక్షల్లో విజయానికి సైకాలజీ’ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. పరీక్షలను భయంతో కాకుండా ఆత్మవిశ్వాసం, ప్రణాళికాబద్ధమైన సాధనతో ఎదుర్కోవాలని సూచించారు. మెదడు పనితీరు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపునకు తగిన నిద్ర, పోషకాహారం, నీరు తీసుకోవడం అవసరమని వివరించారు. డోపమైన్, ఆక్సిటోసిన్, సెరోటోనిన్, ఎండార్ఫిన్స్ అనే నాలుగు రసాయనాల ప్రాధాన్యతను వివరిస్తూ, అవి మానసిక ఆరోగ్యం, ప్రేరణ, భావోద్వేగ సమతుల్యతపై చూపే ప్రభావాన్ని తెలియజేశారు. చదవడం, గుర్తుచేసుకోవడం, పునశ్చరణ చేయడం అనే ‘ఆర్ఆర్ఆర్’ అధ్యయన పద్ధతిని విద్యార్థులకు పరిచయం చేశారు. ఈ పద్ధతిని అలవాటు చేసుకోవడం ద్వారా జ్ఞాపకశక్తి, అభ్యసన సామర్థ్యం మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమాన్ని కేంద్ర గ్రంథాలయ ఇన్‌చార్జి డా. బి. రాధిక రాణి సమన్వయం చేయగా, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో భూముల మెగా వేలం

ఈ నెల 25, 27 తేదీల్లో హెచ్ఎండీఏ ఈ-వేలం
నియోపాలిస్‌లో 4.59 ఎకరాల స్థలం వేలం
మూసాపేట్‌లో 3.15 ఎకరాల భూమికి బిడ్డింగ్

హైదరాబాద్, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్) :

హైదరాబాద్ మహానగర పరిధిలోని కీలక ప్రాంతాల్లో భూముల విక్రయానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సిద్ధమైంది. ఈ నెల 25, 27 తేదీల్లో నిర్వహించనున్న మెగా ఈ-వేలానికి సంబంధించి రాయదుర్గంలోని టీ-హబ్‌లో ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించారు. ఇందులో హెచ్ఎండీఏ అధికారులు, వేలం నిర్వహణ సంస్థ ఎంఎస్‌టీసీ, ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ కేపీఎంజీ ప్రతినిధులు పాల్గొని ఆసక్తిగల బిడ్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు స్థలాల వివరాలు, నిబంధనలను వివరించారు. హుడా హైట్స్, నియోపాలిస్, మూసాపేట్ ప్రాంతాల్లోని భూముల భౌగోళిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, బిడ్డింగ్ విధానాలను ఎంఎస్‌టీసీ అధికారులు వివరించడంతో పాటు ఈఎండీ చెల్లింపులు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, ప్రాజెక్టుల నిబంధనలపై బిడ్డర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఈ నెల 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హుడా హైట్స్‌లోని 8 ప్లాట్లకు వేలం నిర్వహించనున్నారు. 27న అదే సమయానికి నియోపాలిస్‌లోని 4.59 ఎకరాల స్థలానికి, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూసాపేట్‌లోని 3.15 ఎకరాల స్థలానికి ఆన్‌లైన్ బిడ్డింగ్ జరగనుంది. పారదర్శకంగా వేలం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.


విద్య, క్రీడలకు సమ ప్రాధాన్యత ఇవ్వాలి

గిరిజన విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



ఏటూరునాగారం, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహిస్తూ విద్య, క్రీడలకు సమాన ప్రాధాన్యత కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో తొలుత చిరుతపల్లి-xలోని ఏహెచ్ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థినులతో కలిసి పాఠాలు చదువుతూ వారి అభ్యసన సామర్థ్యాన్ని, విద్యా ప్రమాణాలను స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థినులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, పాఠ్యాంశాలను క్రమం తప్పకుండా అభ్యసించాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం, పాఠశాల పరిసరాల నిర్వహణపై కూడా ఆరా తీశారు. అనంతరం లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి క్రీడా పోటీలను సందర్శించి పోటీల నిర్వహణ తీరును పరిశీలించారు. వివిధ క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయని వివరించారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడా పోటీల సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని పీడీలు, పీఈటీలకు స్పష్టం చేశారు. క్రీడాకారులకు అవసరమైన సమయంలో గ్లూకోజ్ వాటర్ అందుబాటులో ఉంచాలని, ఎండ తీవ్రత, అలసట వంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే వైద్య సేవలు అందించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, వారి విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఐటీడీఏ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. విద్య, క్రీడలు, ఆరోగ్యం, సంక్షేమం వంటి అన్ని అంశాల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పర్యటన ద్వారా ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, క్రీడా పోటీల నిర్వహణ, విద్యార్థుల భద్రతపై ఐటీడీఏ పీఓ ప్రత్యేక దృష్టి సారించారు.



పీజీ విద్యార్థులకు ఆంగ్ల భాషా శిక్షణ తప్పనిసరి

కాకతీయ యూనివర్సిటీలో రెండు క్రెడిట్ల సీఈఎల్‌టీ కోర్సు అమలు



కేయూ క్యాంపస్, 17 నవంబర్ (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయంలో 2026--27 విద్యా సంవత్సరం నుంచి పీజీ విద్యార్థులకు ఆంగ్ల భాషా ప్రావీణ్యం, భావ వ్యక్తీకరణ, సంభాషణా నైపుణ్యాలను పెంపొందించేందుకు సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (సీఈఎల్‌టీ) శిక్షణ తరగతులను ప్రవేశపెట్టారు. అన్ని పీజీ నాన్-ప్రొఫెషనల్ కోర్సుల మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ శిక్షణను రెండు క్రెడిట్ల తప్పనిసరి కోర్సుగా అమలు చేయనున్నారు. వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం వంటి నాలుగు ప్రధాన భాషా నైపుణ్యాలపై 20 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందిస్తారు. సైన్స్ విద్యార్థులకు మొదటి సెమిస్టర్‌లో, మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాల విద్యార్థులకు రెండో సెమిస్టర్‌లో తరగతులు నిర్వహిస్తారు. ఈ కోర్సుకు 50 మార్కులకు పరీక్ష నిర్వహించగా, బాహ్య పరీక్షకు 40, అంతర్గత మూల్యాంకనానికి 10 మార్కులు కేటాయించారు. విద్యార్థుల హాజరు, తరగతుల్లో భాగస్వామ్యం, అభ్యసన పురోగతి ఆధారంగా అంతర్గత మూల్యాంకనం చేస్తారు. తరగతులకు హాజరు కావడం, నిర్దేశించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి. ఈ కోర్సులో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులను సంబంధిత సెమిస్టర్‌లో ఉత్తీర్ణులుగా పరిగణించరు. కోర్సు మార్కులకు సెమిస్టర్ మొత్తం మార్కుల శాతంలో వెయిటేజీ ఉండదు. ఇప్పటికే నిర్వహిస్తున్న తరగతులకు హాజరుకాని విద్యార్థులు వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి కోర్సు నిబంధనలను పూర్తి చేయాలని సూచించారు. పీజీ విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, వృత్తిపరమైన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని సీఈఎల్‌టీ డైరెక్టర్ డా. ఆర్. మేఘనా రావు తెలిపారు.

విమర్శలకు రాహుల్ గాంధీ కౌంటర్

న్యూఢిల్లీ, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల మధ్య ఉన్న ప్రేమానుబంధంపై తాను చేసిన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సోనియా గాంధీ రచించిన ‘బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్’ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, తన చిన్నతనంలో తల్లిదండ్రుల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. భోజనం చేసే సమయంలో తండ్రి రాజీవ్ గాంధీ ఒడిలో తల్లి సోనియా గాంధీ కూర్చునేవారని వెల్లడించారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విమర్శలు, చర్చలు మొదలవడంతో మంగళవారం ఎక్స్‌లో శివపార్వతులు నందిపై ఆసీనులైనట్లు ఉన్న పురాతన ఆలయ శిల్పం ఫొటోను పంచుకున్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో భయం, కోపం, విద్వేషం పేరుకుపోయాయని, అవి ప్రేమను అనుభవించకుండా, వ్యక్తపరచకుండా అడ్డుకుంటున్నాయని పేర్కొన్నారు. ఒక నిజమైన హిందువుగా వారిని ఆ భావాల నుంచి విముక్తి చేసి, జీవితంలోని ప్రేమానుబంధాల సౌందర్యాన్ని ఆస్వాదించేలా చేయడం తన బాధ్యతని వ్యాఖ్యానించారు. తన సందేశానికి ‘సత్యం శివం సుందరం’ అనే పదాలను జోడించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించింది!

420 హామీలు, ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యం..
వైఎస్ఆర్ గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి
మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



కాజీపేట, 17 నవంబర్ (జై భీమ్ న్యూస్)

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. మంగళవారం కాజీపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 420 హామీలు, ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మేనిఫెస్టోలోని హామీలను విస్మరించిందని ఆరోపించారు. వైఎస్ఆర్ గుడిసె వాసులకు పట్టాలు, బ్రిడ్జి నిర్మాణం చేస్తామని గతంలో హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఇప్పుడు వారిని ఎందుకు ఖాళీ చేయిస్తున్నారని ప్రశ్నించారు. పేదలకు పట్టాలు ఇవ్వాలని, వారి ఇళ్ల తొలగింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గుడిసె వాసులకు అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు.

కుడా భూములపై విచారణ జరపాలి

కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ నాయిని రాజేందర్ రెడ్డి అనభ్య పదజాలంతో విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. బాలసముద్రంలోని కుడా భూముల వేలంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, మార్కెట్ విలువ ఎక్కువగా ఉన్న భూములను తక్కువ ధరకు ఎలా విక్రయించారని ప్రశ్నించారు. కాజీపేట చౌరస్తా వాణిజ్య భవన నిర్మాణ అనుమతులపై విచారణ జరిపించాలని సవాల్ చేశారు. వైఎస్ఆర్ గుడిసె వాసుల భూముల విషయంలో జోక్యం చేసుకోవద్దని, వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు నర్సింగరావు, జోరిక రమేష్, రాష్ట్ర నాయకులు నార్లగిరి రమేష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా జిల్లేపల్లి పవన్



హైదరాబాద్, 17 నవంబర్ (జై భీమ్ న్యూస్)

జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా జిల్లేపల్లి పవన్ నియమితులయ్యారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి నాయకుడిగా విద్యార్థుల సమస్యలు, హక్కుల సాధన కోసం పోరాడిన ఆయనకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ యువజన అధ్యక్షుడిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు.విద్యార్థి దశ నుంచే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్యా హక్కులు, ఉపకార వేతనాలు, వసతి గృహాల సౌకర్యాలు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం కోసం ఆయన నిరంతరం కృషి చేశారు. విద్యార్థుల సమస్యలపై పలు ఉద్యమాలు, కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం గూగుల్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.బీసీ ఉద్యమ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఉద్యమ స్ఫూర్తితో, డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ మార్గదర్శకత్వంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బీసీ యువతను సంఘటితం చేయడమే తన ప్రధాన లక్ష్యమని పవన్ తెలిపారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత, సామాజిక సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ యువత అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.విద్యార్థులు, నిరుద్యోగ యువత, వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, యువతకు మెరుగైన విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో చేపట్టనున్నట్లు వెల్లడించారు.తనపై విశ్వాసం ఉంచి జాతీయ స్థాయి బాధ్యతలు అప్పగించిన ఆర్. కృష్ణయ్యకు, డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్‌కు జిల్లేపల్లి పవన్ కృతజ్ఞతలు తెలిపారు. వారి మార్గదర్శకత్వంలో యువత అభ్యున్నతి, సామాజిక న్యాయం, బీసీ వర్గాల సాధికారత కోసం మరింత బాధ్యతతో పనిచేస్తానని స్పష్టం చేశారు.

వైఎస్ఆర్ నగర్ భూములపై రికార్డుల రగడ!





ఆర్టీఐ పత్రాలతో ఎమ్మెల్యే నాయిని వివరణ
2018 వరకు సీలింగ్ భూములు..
2019లో నాలా కన్వర్షన్ ఎలా జరిగింది?
కాజీపేట చౌరస్తా భవన నిర్మాణ అనుమతులపైనా ప్రశ్నలు
రెవెన్యూ, కుడా, బల్దియా రికార్డులు మీడియా ముందు వెల్లడి
వైఎస్ఆర్ నగర్ పేదలకు అండగా ఉంటా..
నాయిని స్పష్టం

కాజీపేట, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

కాజీపేట వైఎస్ఆర్ నగర్ భూములు, కాజీపేట చౌరస్తాలో నిర్మించిన భవనానికి సంబంధించిన వివాదాలపై వస్తున్న రాజకీయ ఆరోపణలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పందించారు. మంగళవారం కాజీపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో సమాచార హక్కు చట్టం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల నుంచి సేకరించిన రెవెన్యూ రికార్డులు, భూముల వివరాలు, నిర్మాణ అనుమతులకు సంబంధించిన పత్రాలను మీడియా ముందు ఉంచి తన వివరణ ఇచ్చారు.

2019 భూ మార్పులపై ప్రశ్నలు

వైఎస్ఆర్ నగర్ భూములు గతంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలో ఉన్నాయని, ఈ వ్యవహారంపై ఇరానీ కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారని నాయిని తెలిపారు. 2018 వరకు సీలింగ్ భూములుగా ఉన్న భూములు 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలా కన్వర్షన్ ద్వారా ఇరానీ కుటుంబ సభ్యుల పేర్లపై ఎలా నమోదయ్యాయనే అంశంపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ మార్పులకు సంబంధించిన పహాణీలు, రెవెన్యూ రికార్డులను మీడియాకు చూపించారు. గుడిసెవాసుల హక్కుల అంశంపై కూడా సమగ్ర విచారణ జరగాలని కోరారు.

భవన నిర్మాణ అనుమతులపై వివరణ

కాజీపేట చౌరస్తాలో నిర్మించిన భవనానికి సంబంధించి 2017లో రెసిడెన్షియల్ భూమిని కమర్షియల్ అవసరాలకు ఎలా మార్చారనే ప్రశ్నను ఎమ్మెల్యే లేవనెత్తారు. భవన నిర్మాణ అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ మార్పులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ మంజూరు తదితర అంశాలకు సంబంధించిన పత్రాలను ప్రస్తావించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, కుడా, మున్సిపల్ కార్పొరేషన్ రికార్డులను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

పేదలకు అండగా ఉంటాలి

వైఎస్ఆర్ నగర్‌లో నివసిస్తున్న పేద ప్రజలను ఎవరూ ఇబ్బందులకు గురిచేయవద్దని, అధికారులు అనవసరంగా భయాందోళనలకు గురిచేయకూడదని నాయిని స్పష్టం చేశారు. ప్రస్తుతం అక్కడ 144 సెక్షన్ అమల్లో ఉందని పేర్కొంటూ ప్రజల ప్రశాంతతకు భంగం కలగకుండా, బయటి వ్యక్తుల ద్వారా వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజకీయ ఆరోపణలపై స్పందన

హంటర్ రోడ్డులో శిల్పారామం, ఇతర పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనల నేపథ్యంలో విగ్రహం ఏర్పాటు, ధ్వంసం ఘటనలను కూడా ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఈ ఘటనలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ఉన్నాయని తెలిపారు. కుడా భూముల వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని వరంగల్ బస్టాండ్, స్టేడియం అభివృద్ధి వంటి ప్రజాప్రయోజన కార్యక్రమాలకు వినియోగించాలనే ఆలోచనతో అధికారులతో చర్చించినట్లు వెల్లడించారు. రాజకీయ విమర్శలకు తాను భయపడబోనని, ప్రతి అంశానికి సంబంధించిన అధికారిక రికార్డులను ప్రజల ముందుంచుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ రాజాలి, తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, అబూబకర్, గుంటి కుమార్, సీనియర్ నాయకులు అంకుష్, సమత రాజు, పల్లకొండ సతీష్, డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మక్క సాగర్ బ్యారేజీకి వెంటనే నిరభ్యంతర పత్రం జారీ చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి





ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయికి విజ్ఞప్తి.. త్వరగా ఎన్ఓసీ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ

రాయ్‌పూర్, నవంబర్ 17 (జై భీమ్ న్యూస్)

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన బహుళ ప్రయోజనాల సమ్మక్క సాగర్ బ్యారేజీకి వెంటనే నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. రాష్ట్రంలోని కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చడంలో సమ్మక్క సాగర్ బ్యారేజీ ఎంతో కీలకమని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయితో సమావేశమై ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా భవిష్యత్తులో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని, సమ్మక్క సాగర్ బ్యారేజీలో గోదావరి జలాలను నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతుల మంజూరులోనూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందిస్తూ ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తొలుత కాంతనపల్లి వద్ద ఈ ప్రాజెక్టును నిర్మించాలని ప్రతిపాదించగా, ఆ ప్రాంతంలో సుమారు 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. దీనివల్ల 17 ఆదివాసీ గ్రామాలు ముంపునకు గురికావడంతో పాటు ప్రజల భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని గుర్తించారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ముంపు ప్రభావాన్ని తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని కాంతనపల్లి నుంచి తుపాకులగూడెంకు మార్చారు. ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ ప్రభుత్వం రూ.9.883 కోట్లను ఏప్రిల్ నెలలోనే చెల్లించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ సంస్థ అధ్యయనం నిర్వహించి తన నివేదికను జూలై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం తుపాకులగూడెం వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సుమారు 33 ఎకరాల భూమి మాత్రమే ముంపునకు గురవుతుందని, భారీ వరదలు వచ్చినప్పటికీ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదని వెల్లడైంది. ఇప్పటికే ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద 6.94 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వినియోగించి కరువు ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయానికి సాగునీరు అందించడంతో పాటు గిరిజన, వెనుకబడిన ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పరిధిలో భూసేకరణ, భూములకు పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బ్యారేజీ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ప్రజలకు ప్రాజెక్టు ప్రయోజనాలు అందించేందుకు వెంటనే నిరభ్యంతర పత్రం జారీ చేయాలని, మిగిలిన అనుమతుల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కోరారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారంతో అనుమతుల సమస్య పరిష్కారమైతే సమ్మక్క సాగర్ బ్యారేజీ ద్వారా తెలంగాణలోని రైతులు, గిరిజన ప్రాంతాల ప్రజలకు సాగునీరు, తాగునీటి ప్రయోజనాలు అందుబాటులోకి రానున్నాయి.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM